సాక్షి నిజామాబాద్

సోమవారం | 24 | జూలై | 2023



ఒంటరి మహిళలే లక్ష్యంగా..

ఒంటరి మహిళలే లక్ష్యంగా జిల్లాలో చైన్ స్నాచర్లు రెచ్చిపోతున్నారు. బైక్‌లపై వచ్చి చోరీలకు పాల్పడుతున్నారు.

- 8లో ▸



సర్కారు బడుల్లో శాలసిద్ధి

ప్రభుత్వ స్కూళ్లలో మౌలిక వసతులు, పనితీరు సౌకర్యాలను పరిశీలించే శాలసిద్ధి కార్యక్రమంపై టీచర్లకు శిక్షణ ఇవ్వనున్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం

28.4 /23.7

వాతావరణం

ఆకాశం ఉదయం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం చిరుజల్లులు కురిసే అవకాశముంది. సాయంత్రం మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

28న పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లు

నిజామాబాద్ అర్బన్ : ఈనెల 28న పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీరాం కూమర్ తెలిపారు. దీనికి కోసం విద్యార్థులు సంబంధిత కళాశాలలో ఈనెల 25 తేదీన దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అలాగే ఇదివరకే కళాశాలలో సీట్లు కేటయించిన విద్యార్థులు నేడు కళాశాలలో రిపోర్ట్ చేయాలన్నారు. ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్ట్ చేయాలన్నారు.

నేడు 'డబుల్' ఇళ్లపై బీజేపీ ధర్నా

సుభాష్‌నగర్ : కేంద్ర ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణానికి ఇచ్చిన నిధులు పక్కదారి పట్టించడం, పేదల సొంతింటి కల నెరవేర్చకుండా కేసీఆర్ ప్రభుత్వం హామీని తుంగలో తొక్కడాన్ని నిరసిస్తూ పాత కలెక్టరేట్ వద్ద ధర్నా చౌక్‌లో బీజేపీ సోమవారం ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీ అర్వింద్ ధర్మపురి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ హాజరవుతున్నారని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాలు, మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు తరలిరావాలన్నారు.

ఎస్సారెస్పీలోకి తగ్గిన వరద




బాల్కొండ : శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు తగ్గుముఖం పట్టింది. ఎగువ ప్రాంతాల నుంచి 26,300 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ఎగువ ప్రాంతాల్లో వర్షపాతం తక్కువ నమోదు కావడంతో ప్రాజెక్టులోకి వరద నీరు తగ్గింది. క్రితం రోజు లక్షా 58 వేల క్యూసెక్కులు వచ్చిన వరద ఉదయానికి 78 వేలకు తగ్గింది. మధ్యాహ్నానికి 36 వేల క్యూసెక్కులు వచ్చిన వరద సాయంత్రానికి 26,300 క్యూసెక్కులకు పడిపోయింది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 1091(90 టీఎంసీలు) అడుగులు కాగా ఆదివారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1083.60(62 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు పేర్కొన్నారు.

నిజాంసాగర్‌లోకి 6,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



నిజాంసాగర్ : నిజాంసాగర్ ప్రాజెక్టులోకి ఆదివారం 6,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు(17.8 టీఎంసీలు) కాగా ఆదివారం సాయంత్రానికి 1,399.83 అడుగుల (11.182 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.





గోదావరి తీరం.. ప్రకృతి అందాలకు నిలయం

ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ప్రాంతం ప్రకృతి అందాలకు నిలయంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు గోదావరి తీరంలో కొత్తదనం నెలకొంది. నేలపై పరుచుకున్న పచ్చదనం, ఒడ్లపై అక్కడక్కడా పెరిగిన పూలచెట్లు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. ముంపునకు గురైన పాత గాదేపల్లి వద్ద ప్రకృతి నడుమ పురాతన దేవాలయాలు, ఎత్తయిన తాటి చెట్లు కనువిందు చేస్తున్నాయి. – డొంకేశ్వర్ (ఆర్మూర్)

వాన కురిసే.. రైతు మురిసె..

- జిల్లాలో ఊపందుకున్న వ్యవసాయ పనులు
- రెండున్నర లక్షల ఎకరాలు దాటిన వరినాట్లు
- అంచనాకు మించి సాగైన మొక్కజొన్న, పత్తి
- పంటల నమోదులో బిజీగా అధికారులు

చినుకు జాడ కోసం కొంత కాలంగా ఎదురుచూస్తున్న రైతుల్లో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు ఆశలు రేకెత్తించాయి. దీంతో జిల్లాలో పంట సాగు జోరందుకుంది. రైతులు వరినాట్లను వేగవంతం చేశారు. నాట్లు వేసేందుకు స్థానికులతో పాటు ఉత్తరప్రదేశ్, బీహార్, ఏపీ, నల్గొండ ప్రాంతాల నుంచి కూలీలు వచ్చారు.

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లాలో గడిచిన ఐదు రోజుల్లోనే ఏకంగా లక్ష ఎకరాల్లో నాట్లు పడ్డాయి. వానాకాలం సీజన్‌లో ఇప్పటివరకు రెండున్నర లక్షల ఎకరాల వరకు (70 శాతం)వరి సాగైంది. నెలాఖరు నాటికి మూడు లక్షల ఎకరాలు దాటే అవకాశముంది. అన్ని పంటలు కలిపి జిల్లాలో 5,13,356 ఎకరాల్లో పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేయగా, ప్రస్తుతం 3,67,101 ఎకరాల్లో (77శాతం) సాగవుతోంది. ఇందులో వరిపంటదే సింహభాగం. ఈసారి కూడా రైతులు సన్నరకాలే ఎక్కువ సాగు చేస్తున్నారు. ఐతే, శరవేగంగా నాట్లు పడడంతో యూరియాకు డిమాండ్ ఏర్పడింది. రైతులు అవసరానికి మించి ఒకేసారి కొనుగోలు చేసి నిల్వ చేస్తున్నారు. ఇటు పంటల వివరాలను నమోదు చేసే పనిలో వ్యవసాయాధికారులు నిమగ్నమయ్యారు.

ఇప్పటి వరకు సాగైన పంటలు (ఎకరాల్లో..)

పంట	అంచనా	సాగైంది
వరి	4,17,943	2,50,036
మొక్కజొన్న	32,185	35,520
సోయా	58,715	47,926
పత్తి	1,883	2,143
పసుపు	23,722	19,022
కంది	1,803	905
పెసర	151	30
మినుము	125	44



డొంకేశ్వర్ మండలం కోమట్‌పల్లి శివారులో వరినాట్లు వేస్తున్న వలస కూలీలు

వలస కూలీలకు దండిగా ఉపాధి

జిల్లాలో వరినాట్లు వేయడానికి గ్రామాల్లోని స్థానిక మహిళల కూలీలు అధికంగా వస్తున్నారు. అయితే వీరితో పాటు ఎప్పటిలాగే యూపీ, ఏపీ, బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల నుంచే కాకుండా నల్గొండ నుంచి పెద్ద ఎత్తున మగ కూలీలు జిల్లాకు వలస వచ్చారు. ఖరీఫ్, యాసంగి సీజన్లలో కూలీలను బయట ప్రాంతాల నుంచి తెప్పించడానికి జిల్లా చాలామంది ముసీంలుగా పని చేస్తున్నారు. వచ్చిన వారికి భోజనం, షెల్టరు అందిస్తున్నారు. మగ కూలీల బృందంలో 10–15 మంది ఉంటారు. వీరు ఎకరానికి రూ.4,500 నుంచి రూ.5,400 వరకు కూలీ తీసుకుని నాట్లు వేస్తారు. దీంతో నాట్లు వేసిన ఒక్కో కూలీకి రూ.500 వరకు ఉపాధి లభిస్తోంది.

ఆగస్టు 15వరకు నాట్లు వేయొచ్చు



మక్క, సోయా, పసుపు విత్తుకోవడానికి సమయం దాదాపుగా అయిపోయింది. అయితే, ఆగస్టు15 వరకు వరి నాట్లు వేసుకోవడానికి అవకాశం ఉంది. ఇప్పటికే 70శాతం మేర నాట్లు పడ్డాయి. వానాకాలం సీజన్ అంచనాకు మించి వరి సాగయ్యే పరిస్థితి కనిపిస్తోంది.

– వాజిద్ హుస్సేన్, జిల్లా వ్యవసాయాధికారి

32,185 ఎకరాల్లో మొక్కజొన్న..

వ్యవసాయ శాఖ అంచనా వేసిన దానికంటే మొక్కజొన్న, పత్తి పంటలు ఎక్కువగా సాగయ్యాయి. 32,185 ఎకరాల్లో మక్క సాగవుతుందని అంచనా ఉంటే, రైతులు ఇప్పటివరకు 35,520 ఎకరాల్లో సాగు చేశారు. గత రెండేళ్లుగా మక్కకు మార్కెట్‌లో మంచి ధర రావడంతో రైతులు ఎక్కువ సాగు చేస్తున్నారు. అదేవిధంగా పత్తిపంట 1,883 ఎకరాల్లో సాగు చేస్తారని అంచనా ఉండగా, 2,143 ఎకరాల్లో సాగవడం గమనార్హం. పసుపు, సోయా పంటలు అంచనాల కంటే తక్కువగానే సాగయ్యాయి. పప్పుదినుసుల పరిస్థితి కూడా అంతే ఉంది.

పరేషన్



- బియ్యం రాక దుకాణాల చుట్టూ చక్కర్లు..
- 23వ తేదీ గడిచినా.. అందని ప్రజాపంపిణీ బియ్యం
- నిల్వలు నిండుకోవడమే కారణం..!
- పెద్దపల్లి నుంచి తరలిస్తున్న అధికారులు

సుభాష్‌నగర్ : నెల మొదటివారంలో రావాల్సి రేషన్ బియ్యం.. చివరి వారంలోకి వచ్చినా అందకపోవడంతో కార్డుదారులు పరేషాన్ అవుతున్నారు. ప్రజాపంపిణీ బియ్యం కోసం రేషన్ దుకాణాల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. జిల్లాలో 97వేల మెట్రిక్ టన్నుల ఎఫ్ఆర్‌కే(ఫోర్టిఫైడ్ రైస్ కెర్నెల్స్) ధాన్యం నిల్వలు ఉన్నా.. నాన్ ఎఫ్ఆర్‌కే నిల్వలు నిండుకున్నాయని తెలిసింది. పెద్దపల్లి జిల్లా నుంచి నాన్ ఎఫ్ఆర్‌కే బియ్యం దిగుమతి చేసుకుంటూ రేషన్ దుకాణాలను తరలిస్తున్నారు. ఆహారభద్రత కార్డుదారులకు అవసరమైన బియ్యం జిల్లాకు చేరాయని, కార్డుదారులకు సోమవారం నుంచి పంపిణీ చేస్తారని పౌరసరఫరాల సంస్థ అధికారులు పేర్కొంటున్నారు.

జిల్లాలో 4,05,000 ఆహారభద్రత కార్డులు, అంత్యోదయ కార్డులు, 758 రేషన్ దుకాణాలు ఉన్నాయి. జిల్లాకు 7 వేల మెట్రిక్ టన్నుల బియ్యం అవసరమవుతోంది. 3వేల మెట్రిక్ టన్నుల అందుబాటులో ఉండగా, మిగితా 4వేల మెట్రిక్ టన్నులు పెద్దపల్లి జిల్లా నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. స్కూళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలకు కొరత రాకుండా బియ్యం సరఫరా చేస్తున్నారు. కానీ రేషన్‌దుకాణాలకు మాత్రం ఈనెల ఆలస్యమౌతోంది. వర్షాల కారణంగా పెద్దపల్లి జిల్లా నుంచి రావాల్సిన బియ్యం జిల్లాకు చేరకపోవడంతో పంపిణీ ఆలస్యమైంది.

వచ్చే నెల నుంచి ఎఫ్ఆర్‌కే బియ్యం..

జిల్లాలో వచ్చే నెల నుంచి ఫోర్టిఫైడ్ (ఎఫ్ఆర్‌కే) బియ్యం రేషన్‌దుకాణాల ద్వారా పంపిణీ చేయనున్నారు. అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పౌరసరఫరాల సంస్థ అధికారులు ఇప్పటికే పూర్తిచేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వచ్చే నెల నుంచి పంపిణీ చర్యలు చేపడుతున్నారు. జిల్లాలో నాన్ఎఫ్ఆర్‌కే బియ్యం నిండుకున్నాయి. అందుకే జూలై నెల పంపిణీ ఆలస్యమౌతోంది. ఎఫ్ఆర్‌కే బియ్యం జిల్లాలో 97వేల మెట్రిక్ టన్నుల నిల్వలు ఉన్నాయి.

పెద్దపల్లి నుంచి తెప్పిస్తున్నాం

జిల్లాలో నాన్ ఎఫ్ఆర్‌కే బియ్యం నిల్వలు నిండుకున్నాయి. పెద్దపల్లిలో స్టాక్ అందుబాటులో ఉండటంతో మన జిల్లాకు కేటాయించారు. 4 వేల మెట్రిక్ టన్నుల బియ్యం జిల్లాకు చేరింది.వానలతో బియ్యం జిల్లాకు చేరడం ఆలస్యమైంది. నేటి నుంచి దుకాణాల ద్వారా పంపిణీ చేస్తారు. – జగదీష్‌కుమార్, జిల్లా మేనేజర్, పౌరసరఫరాల సంస్థ

లబ్ధిదారుల్లో అసహనం..

ప్రతినెల మొదటివారంలో తీసుకోవాల్సిన బియ్యం.. చివరి వారమైనా అందక పోవడంతో పేదలు ఎదురుచూస్తున్నారు. నిత్యం అనేకమంది కార్డుదారులు రేషన్ దుకాణాల చుట్టూ తిరగడమే కాకుండా అసహనం వ్యక్తం చేస్తున్నట్లు పలువురు రేషన్ డీలర్లు వాపోతున్నారు. ఈనెల 12వ తేదీ తర్వాత రేషన్‌దుకాణాల్లో బియ్యం పంపిణీని మొదలుపెట్టారు. నాలుగైదు రోజులు పంపిణీ చేసినా.. ఆ తర్వాత బియ్యం జిల్లాకు చేరలేదు. ఇంతలోనే ఎడతెరపి లేకుండా వర్షాలు కురిశాయి. పెద్దపల్లి నుంచి రవాణా కష్టంగా మారడంతో నాలుగైదు రోజులుగా బియ్యం పంపిణీ చేయలేదు. జిల్లాకు అవసరమైన 4వేల మెట్రిక్ టన్నులు ఆదివారం రాత్రి వరకు జిల్లాకు చేరాయి. సోమవారం నుంచి రేషన్ దుకాణాలకు సరఫరా చేస్తాం. రెండ్రోజుల్లో కార్డుదారులకు పంపిణీ చేస్తారు. 25వ తేదీలోగా పంపిణీ ప్రక్రియ పూర్తి చేయాలని డీలర్లను ఆదేశించారు. కొన్ని దుకాణాల్లో ఈనెల కోటాకు సంబంధించి బియ్యం పంపిణీ చేయకపోవడం గమనార్హం.

బల్దియాపై తనదైన మార్క్

- తనిఖీలతో హల్‌చల్ చేస్తున్న కొత్త కమిషనర్ మంద మకరందు
- ఏ విభాగాన్ని తనిఖీ చేస్తారోనని నిత్యం ఉద్యోగుల్లో ఆందోళన
- సానిటేషన్ అధికారుల్లో గుబులు



మాలపల్లిలో సానిటేషన్ పనితీరును పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ మంద మకరందు(ఫైల్)

నిజామాబాద్ నాగారం : నిజామాబాద్ కార్పొరేషన్ కమిషనర్‌గా మంద మకరందు బాధ్యతలు చేపట్టిన వెంటనే విభాగాలన్నింటినీ గాడిలో పెట్టేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. విభాగాలన్నీ అవినీతి, నిర్లక్ష్యం కారణంగా నగర ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారు. పైసలిస్తేనే పని అన్నట్లుగా బల్దియాలో పరిస్థితి తయారైన స్థితిలో ఈనెల 18వ తేదీన కమిషనర్‌గా మంద మకరందు బాధ్యతలు తీసుకున్నప్పటికీ నేరుగా రంగంలోకి దిగారు.

వర్షాలను దృష్టిలో పెట్టుకుని..

వచ్చీరాగానే ఆయన ముఖ్యంగా సానిటేషన్‌పై దృష్టి పెట్టారు. ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. పగలు, రాత్రి తేడా లేకుండా వార్డుల్లో పర్యటిస్తున్నారు. ఉదయం 5 గంటలకే ఆయా జోన్ కార్యాలయానికి స్వయంగా వెళ్లి కార్మికుల హాజరును పరిశీలిస్తున్నారు. ఎవరు, ఎప్పుడు విధులకు హాజరవుతున్నరో క్షేత్రస్థాయిలోకి వెళ్లి గమనిస్తున్నారు. కమిషనర్ తనిఖీలతో అధికారుల్లో హడల్ మొదలైంది. ముఖ్యంగా సానిటేషన్ విభాగంలో అందరు భయపడుతూ టంచన్‌గా సమయానికి విధులకు హాజరవుతున్నారు. మిగితా విభాగాల్లో కూడా తనిఖీలు చేయనున్నట్లు తెలిసింది.

రహస్య నివేదిక..!

నగరంలో సానిటేషన్ అస్తవ్యస్తంగా మారింది. శానిటేషన్‌కు ఇన్‌చార్జి అధికారి కావడంతో ఆయా జోన్లకు ఉన్న అధికారులకు ఆడిందే ఆట, పాడిందే పాటగా వ్యవహరిస్తున్నారు. చెత్తసేకరణ అంతా ఇష్టారాజ్యాంగా జరిగింది.

కార్మికులు విధులకు రాకున్నా వచ్చిన్నట్లు హాజరు వేసుకుని మరీ జీతాలు తీసుకున్న ఘటనలున్నాయి. ఇక డీజిల్ మొత్తం తాగేశారు. దీనిపై 'సాక్షి'లో వరుస కథనాలు రావడంతో ఇన్‌చార్జి కమిషనర్‌గా ఉన్న చిత్రామిశ్రా సానిటేషన్‌ను గాడిలో పెట్టే ప్రయత్నం చేశా రు. నెల రోజుల్లో రూ. 1 లక్ష డీజిల్ ఆదా చేశారంటే సానిటేషన్ విభాగంలో ఏ మేరకు అవినీతి అక్రమాలు జరిగాయో అర్థం చేసుకోవచ్చు. అందుకే నూతనంగా విధుల్లోకి చేరిన కమిషనర్ మంద మకరందు ముందుగా సానిటేషన్‌పైనే ప్రత్యేక దృష్టి సారించారు. ఆకస్మికంగా ఇప్పటికే జోన్–3, జోన్–5, జోన్–2 కార్యాలయాలను తనిఖీలు చేశారు. మిగితా జోన్లను కూడా ఎప్పుడస్తాడోనని భయపడుతున్నారు. ఇప్పటికే తనిఖీలతో ఆయా జోన్లలో స్వయంగా క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందో తెలుసుకొని రహస్య నివేదిక తయారు చేసుకున్నట్లు వినికిడి.

ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్, రెవెన్యూపై ఫోకస్

కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆరు రోజుల్లో తనిఖీలు, పర్యటనలతో బిజీగా ఉన్నారు. పర్యటన అనంతరం కార్యాలయంలో ఆయా విభాగాల్లో ఏం జరుగుతుందో తెలుసుకోవడానికి ప్రత్యేకంగా సమీక్షలు నిర్వహిస్తున్నారు. వర్షాకాలం సందర్భంగా ఇంజినీరింగ్ అధికారులకు కూడా నీరు ఎక్కడా నిలువకుండా చూడాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం శానిటేషన్, ఇంజినీరింగ్‌లపై దృష్టి పెట్టారు. దీంతో పాటు ఎన్నికల ప్రక్రియపై సమీక్షిస్తున్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఓటరు జాబితాలో తప్పులు, ఉండకుండా, బీఎల్‌వోలకు శిక్షణతో కూడిన అవగాహన కల్పిస్తున్నారు. ఇంకా టౌన్‌ప్లానింగ్, రెవెన్యూపై అతి త్వరలోనే దృష్టి పెట్టే అవకాశం ఉంది.

స్వల్పంగానే మెస్ చార్జీల పెంపు

- మెస్ చార్జీలకు అదనంగా రూ. 10 పెంచిన ప్రభుత్వం
- ఏమాత్రం సరిపోవంటున్న ఏజెన్సీలు



మోర్తాడ్‌లోని గురుకుల పాఠశాలలో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న తోటి విద్యార్థులు(ఫైల్)

మోర్తాడ్(బాల్కొండ): ఊరించి ఊసురుమనిపించినట్లుంది గురుకుల పాఠశాలల విద్యార్థుల పట్ల ప్రభుత్వం తీరు. అన్ని రకాల గురుకుల పాఠశాలల్లోని విద్యార్థుల కోసం చెల్లించే మెస్ చార్జీల మొత్తాన్ని పెంచుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. పెంచిన చార్జీలను ఇప్పుడు ఉన్న ధరలతో పోల్చితే చార్జీలను స్వల్పంగానే పెంచారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. నిత్యావసర సరుకుల ధరలు రోజురోజుకూ పెరుగుతుండటం, కూరగాయలు, పండ్లు, కోడిగుడ్లు, చికెన్, మటన్ ధరలు విపరీతంగా పెరుగగా అందుకు అనుగుణంగా మెస్ చార్జీలను పెంచాల్సి ఉన్నా ప్రభుత్వం భిన్నంగానే స్పందించింది. మెస్ చార్జీలు తక్కువగా చెల్లించడం వల్ల పౌష్టికాహారం అందడం గగనమవుతోంది. గురుకుల పాఠశాలలకు కేవలం బియ్యంను మాత్రమే పౌర సరఫరాల శాఖ సరఫరా చేస్తుంది. మిగిలిన సామగ్రిని మొత్తం వార్డెన్లు కొనుగోలు చేయడం లేదా ఏజెన్సీలే కొనుగోలు చేసి చార్జీలను పొందాల్సి ఉంటుంది.

జిల్లాలో..

జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో బీసీ మహాత్మా జ్యోతిబాపూలే, మైనార్టీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ గురుకుల పాఠశాలలు ఉన్నాయి. బీసీలకు సంబంధించి మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలు ప్రతి నియోజకవర్గంలో బాలికలకు వేరు, బాలురకు వేరువేరుగా ఉన్నాయి. ప్రతి గురుకుల పాఠశాలలో 300ల నుంచి 400 మంది వరకు విద్యార్థులు వసతి పొందుతూ చదువుకుంటున్నారు. వీరిలో ప్రాథమిక తరగతుల వారికి మెస్ చార్జీలు ఒకలా, ఉన్నత తరగతుల వారికి మరొకలా ఉన్నాయి. రోజువారీగా రూ. 31 నుంచి రూ. 36 వరకు మెస్‌చార్జీలను చెల్లించేవారు. తాజాగా ప్రభుత్వం పెంచిన చార్జీల ప్రకారం రూ. 40 నుంచి రూ. 46 వరకు చెల్లించనున్నారు. ఒక్కో విద్యార్థిపై మెస్ చార్జీని రోజుకు రూ. 10 మాత్రమే పెంచారు. గతంలో కంటే అన్ని రకాల సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయి. అలాంటి సమయంలో మెస్ చార్జీలను కనీసం రోజుకు రూ. 20కి మించి పెంచాల్సి ఉందని విద్యార్థి సంఘాల నాయకులు చెబుతున్నాయి. ఇటీవల టమాటా ధరలు ఆకాశాన్ని అంటడంతో గురుకుల పాఠశాలలకు కూరగాయలను సరఫరా చేసే కాంట్రాక్టర్లు కొన్ని రోజుల పాటు వాటి జోలికి పోలేదు. టమాటా స్థానంలో ఇతర కూరగాయలను సరఫరా చేశారు. కోడిగుడ్ల ధరలు పెరిగిన సమయంలో విద్యార్థులకు రోజుకు ఒక గుడ్డుకు బదులు రెండు మూడు రోజులకు ఒక గుడ్డును అందించారు. మెస్ చార్జీల ప్రకారం టెండర్ ధర తక్కువగా ఉండటం సామగ్రి ధరలు పెరగడంతో విద్యార్థులకు కోత పెంచక తప్పలేదని వెల్లడవుతోంది. ఇప్పుడు నెల రోజులకు 3 నుంచి 7వ తరగతి విద్యార్థులకు రూ. 1,200, 8వ తరగతి నుంచి 10వ తరగతి వరకు రూ. 1,400ల చార్జీలను చెల్లించనున్నారు. గతంలో కంటే రూ. 250 నుంచి రూ. 300 చార్జీలే పెంచారు. ప్రభుత్వం పునరాలోచన చేసి మెస్ చార్జీలను మరింత ఎక్కువ చేయాలని పలువురు కోరుతున్నారు.

నామమాత్రంగానే పెంచారు



గురుకుల పాఠశాలల విద్యార్థులకు మెస్ చార్జీలను నామమాత్రంగానే పెంచారు. ధరల పెరుగుదలను పరిగణలోకి తీసుకుని ఉంటే మెస్ చార్జీలను ఇంకా పెంచేవారు. ఏదో కంటి తుడుపు చర్యగా ప్రభుత్వం నామమాత్రంగానే చార్జీలను పెంచింది.

– నల్ల నవీన్, ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు

న్యాయం జరగడం లేదు



మెస్ చార్జీలను పెంచే విషయంలో విద్యార్థులకు న్యాయం జరగడం లేదు. ధరలు ఆకాశాన్ని అంటితే ప్రభుత్వం మాత్రం ఏదో పెంచామంటే పెంచినట్లు ప్రకటన చేసింది. పండ్లు, కూరగాయల ధరలు విపరీతంగా పెరిగిన విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలి.

– వేణు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు

క్లుప్తంగా

లయన్స్ క్లబ్ కార్యవర్గ ప్రమాణస్వీకారం



నిజామాబాద్‌నాగారం: లయన్స్ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం నగరంలోని గుజరాతి భవనలో జరిగింది. లయన్స్ గవర్నర్ పోలవరపు లక్ష్మీ మాట్లాడుతూ సేవా కార్యక్రమాలను మరింత విస్తృత పర్చాలన్నారు. అధ్యక్షుడు ధర్మేందర్ పటేల్, కార్యదర్శి ద్వారకాదాస్ అగర్వాల్, కోశాధికారి సంజయ్‌టక్కర్ ప్రమాణా స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ పూర్వ గవర్నర్లు పెంటయ్య, రామకృష్ణారెడ్డి, బసవేశ్వరరావు, ప్రతినిధులు యాదగిరి, లక్ష్మీ నారాయణ, శంకర్, ద్వారకాదాస్, అనిల్‌పటేల్, ఉండవల్లి శివాజీ పాల్గొన్నారు.

ఖిల్లా రామాలయం చైర్మన్‌గా మహేందర్‌రెడ్డి



డిచ్‌పల్లి: జిల్లాలోనే చారిత్రక ప్రసిద్ధి చెందిన డిచ్‌పల్లి ఖిల్లా రామాలయం కమిటీ చైర్మన్‌గా పొద్దుటూరి మహేందర్‌రెడ్డి నియామకమయ్యారు. ఈ మేరకు ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఆదివారం సాయంత్రం మహేందర్‌రెడ్డికి నియామకపత్రం అందజేశారు. మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే సహకారంతో ఖిల్లా రామాలయాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతానని అన్నారు. జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, సర్పంచ్ గడ్డం రాధా కిష్టారెడ్డి, చింత శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



బిచ్కుంద: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను శనివారం రాత్రి తహసీల్దార్ భరత్ పట్టుకున్నారు. ఖద్గాం క్వారీ నుంచి ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నామని ఆర్ఐ సాయిబాబా తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

బోధన్‌టౌన్: బోధన్ శక్కర్‌నగర్ చౌరస్తాలోని మధుమాలాంచ పాఠశాల సమీపంలోని ఓ పాత బంగ్లాలో అనుమానాస్పద స్థితిలో మాజిద్ ఖాన్(25) అనే యువకుడు మృతి చెందాడు. సీఐ ప్రేమ్‌కుమార్ తెలిపిన వివరాలు.. రెంజల్ బేస్ కాలనీకి చెందిన మాజిద్‌ఖాన్ ఆటో మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం మిత్రులతో కలిసి పాత బంగ్లా వద్దకు వెళ్లాడు. కాగా మాజిద్‌ఖాన్ అన్న వాజిద్‌ఖాన్‌కు ఆరీఫ్ అనే యువకుడు ఫోన్ చేసి బంగ్లా కూలి మీ తమ్ముడికి గాయాలు అయ్యాయని చెప్పాడు. వాజిద్ ఘటనా స్థలానికి వెళ్లగా మాజిద్‌ఖాన్ మార్మంగం, తలపై గాయాలతో పడి ఉన్నాడు. ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. తన తమ్ముడిని మిత్రులు కొట్టి హత్య చేశారని మృతుడి అన్న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మృతుడి మిత్రులు ఆరీఫ్, షాను, నాసర్‌పై అనుమానం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. సీఐ మాట్లాడుతూ.. ఘటనా స్థలంలో బంగ్లా కూలిన ఆనవాళ్లు ఉన్నాయని, మృతుడి అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

కళాశాల కోసం పోరుబాట

- బీబీపేటలో జూనియర్ కాలేజీ ఏర్పాటు చేయాలని..
- ఆందోళన బాట పట్టిన కళాశాల సాధన సమితి సభ్యులు
- రోజుకో కార్యక్రమం చేస్తూ అందరినీ ఏకం చేస్తున్న వైనం



పాఠశాల విద్యార్థులతో ర్యాలీ తీస్తున్న సభ్యులు



కళాశాల కోసం సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహిస్తున్న సాధన సమితి సభ్యులు

బీబీపేట: బీబీపేటకు జూనియర్ కాలేజీ సాధించుకోవడమే లక్ష్యంగా అందరు కలిసి పోరుబాట పట్టారు. విద్యార్థి నేతలు, రిటైర్డ్ ఉద్యోగులు, యువజన సంఘాల నేతలంతా కలిసి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జూనియర్ కళాశాల సాధించే వరకు పట్టు వీడేది లేదంటూ ఏకమై 'జూనియర్ కళాశాల సాధన సమితి'గా ఏర్పడి ఉద్యమాన్ని ఉధృతం చేస్తున్నారు. మండల వ్యాప్తంగా ప్రతి గ్రామంలో కార్యక్రమం చేపడుతూ ప్రతి ఒక్కరిని చైతన్యవంతం చేస్తున్నారు.

మంత్రులు హామీ ఇచ్చినా..

బీబీపేటలో ప్రముఖ వ్యాపారవేత్త సుభాష్‌రెడ్డి నిర్మించిన ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల భవనం ప్రారంభానికి 2021 నవంబర్ 9వ వచ్చిన మంత్రులు కేటీఆర్, సబితాఇంద్రారెడ్డి వచ్చారు. వారు బీబీపేటకు జూనియర్ కళాశాల మంజూరు చేస్తున్నామని 2022 విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభిస్తామని ప్రకటించారు. అలాగే వీలు అయితే పాఠశాల భవనంలోనే జూనియర్ కళాశాల కొనసాగిస్తామని, సిబ్బందిని త్వరలోనే భర్తీ చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మంత్రుల ప్రకటనతో ఇంటర్ నోడల్ అధికారితో పాటు, అధికార పార్టీ నేతలు మండల కేంద్రంలో పలు స్థలాలను పరిశీలించారు. టీఎస్‌ఎన్ఆర్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల భవనం కాలేజీకి అనువైందని ఎంపిక చేసి నానా హడావుడి చేసిన నేతలు ఇప్పుడు ఎటు పోయారు అని పలువురు విమర్శిస్తున్నారు. అంతే కాకుండా ఇంటర్ బోర్డుకు డిపాజిట్ చూపడానికి విరాళాలు సేకరించి రూ.మూడు లక్షలు బ్యాంకు ఖాతాలో వేసి ఉంచారు. ఆ డబ్బులు సైతం ఇప్పటివరకు జాడ లేదు.

ఏకమైన పలు సంఘాల నేతలు

మండలంలో జూనియర్ కళాశాల ఏర్పాటే లక్ష్యంగా విద్యార్థి సంఘాల నేతలే కాకుండా కాంగ్రెస్, బీజేపీల నాయకులు, యువజన సంఘాల నేతలు, రిటైర్డ్ ఉద్యోగులు ఏకమై జూనియర్ కళాశాల సాధన సమితిని ఏర్పాటు చేశారు. కళాశాల సాధనే లక్ష్యంగా 20 రోజులుగా రోజుకో కార్యక్రమం చేపడుతూ మండలంలోని పది గ్రామాల్లో ప్రజలను చైతన్యం చేస్తున్నారు. కళాశాల మంజూరు చేయాలని మంత్రి కేటీఆర్‌కు ఉత్తరాలు పంపారు. ప్రతి గ్రామంలో విద్యార్థులతో ర్యాలీలు నిర్వహిస్తున్నారు. అలాగే మంత్రుల చిత్రపటాలకు, స్థానిక ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు అందించడం, సంతకాల సేకరణ, కాగడాల ర్యాలీ, అవగాహన కార్యక్రమాలు, తదితర కార్యక్రమాలతో జూనియర్ కళాశాల ఉద్యమం కొనసాగిస్తున్నారు.

విద్యార్థులకు ఇబ్బందులు

మండలానికి చెందిన విద్యార్థులు జూనియర్ కళాశాలకు వెళ్లాలంటే దోమకొండ, కామారెడ్డిక వెళ్లాల్సిందే. బీబీపేట నుంచి దోమకొండ 15 కి.మీ. కామారెడ్డి 30 కి.మీ దూరం ఉంటుంది. సమయానికి బస్సులు సైతం లేకపోవడం, విద్యార్థులు ఎక్కువగా ఉండడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారు. బస్‌పాస్ కేవలం 30 కి.మీ. వరకు మాత్రమే అవకాశం ఉంటుంది. దీంతో కామారెడ్డికి వెళ్లాలంటే బీబీపేట వరకే బస్సు సదుపాయం ఉంది. తుజాల్‌పూర్, మల్కాపూర్, శేరిబీబీపేట విద్యార్థులకు కామారెడ్డి వరకు బస్‌పాస్ సదుపాయం లేకపోవడంతో బీబీపేట వరకు చార్జీలు చెల్లించి వస్తున్నారు. ఇక్కడి నుంచి బస్‌పాస్ ద్వారా కామారెడ్డి చేరుకుంటున్నారు.

కళాశాల మంజూరు చేయాలి



బీబీపేట మండలం అన్ని రకాలుగా అభివృద్ధి చెందిన ప్రాంతం. ఇక్కడ జూనియర్ కళాశాల మంజూరు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మంత్రులు హామీ ఇచ్చి రెండేళ్లు గడుస్తున్నా కళాశాల ప్రారంభం కాలేదు. కళాశాల ప్రారంభించే వరకు ఆందోళన కార్యక్రమాలు చేపడుతూనే ఉంటాం. – దేవునిపల్లి దేవరాజు, కళాశాల సాధన సమితి సభ్యుడు

దూరభారం తగ్గుతుంది




కొన్నేళ్లుగా ఉద్యమాలు చేస్తున్నా.. ఇప్పటికీ కూడా కళాశాలను సాధించుకోలేక పోతున్నాం. కళాశాల కోసం బీబీపేటలో అనువైన వసతులు ఉన్నాయి. మంత్రులు ప్రకటించి ఏళ్లు గడిచినా తరగతులు మాత్రం ప్రారంభం కాలేదు. కాలేజీ ప్రారంభిస్తే మండల విద్యార్థులకు దూరభారం తగ్గుతుంది.

– పోసు శివ, కళాశాల సాధన సమితి సభ్యుడు

ఒంటరి మహిళలే లక్ష్యంగా!

రెచ్చిపోతున్న గొలుసు దొంగలు



ఖలీల్‌వాడి: ఒంటరి మహిళలే లక్ష్యంగా జిల్లాలో గొలుసు దొంగలు రెచ్చిపోతున్నారు. నిర్మానుష్యంగా ఉన్న ప్రాంతాలను ఎంచుకొని ద్విచక్రవాహనాలపై వచ్చి గొలుసులు లాక్కెళ్తున్నారు. అంతేగాకుండా రద్దీ ఎక్కువగా ఉండే అంగడి లాంటి ప్రాంతాల్లో సైతం చైన్‌స్నాచర్లు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. అంతేగాకుండా ఇంట్లో ఒంటరిగా ఉన్న మహిళల మెడలోని గొలుసులను సైతం చోరీ చేస్తున్నారు. అడ్రస్ అడిగినట్లు వచ్చి చైన్ లాక్కొని పారిపోతున్నారు. ఇటీవల ఆర్మూర్‌లో ఓ మహిళ ఇంట్లో టీవీ చూస్తుండగా దొంగ ఇంట్లోకి చొరబడి బంగారు గొలుసు లాక్కొని పారిపోయాడు.

కరువైన నిఘా

పోలీసులు నిఘా లోపించడంతో చైన్ స్నాచింగ్‌లు ఎక్కువగా జరుగుతున్నాయి. సీసీ పుటేజీలను ఏర్పాటు చేసిన వాటి నిర్వహణ లేకపోవడంతో అవి సక్రమంగా పని చేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. పోలీసులు నిఘా పెంచి చైన్ స్నాచర్లను పట్టుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఇటీవల జరిగిన కొన్ని ఘటనలు

ఈ నెల 18న నిజామాబాద్‌లోని మహాలక్ష్మి కాలనీలో ఒంటరిగా వెళ్తున్న మహిళ మెడలోంచి రెండు తులాల బంగారు గొలుసును లాక్కెళ్లారు.

- పదిహేను రోజుల క్రితం ఆర్మూర్‌లోని కుమ్మరిగల్లీకి చెందిన మీనాక్షి స్కూటీపై వెళ్తుండగా వెనక నుంచి బైక్‌పై వచ్చిన వ్యక్తి ఆమె మెడలో నుంచి మూడున్నర తులాల బంగారు గొలుసును ఎత్తుకెళ్లాడు.
- రెండు నెలల క్రితం ఆర్మూర్‌లోని తిరుమల కాలనీలో స్కూటీపై వెళ్తున్న మహిళ మెడలో నుంచి రెండున్నర తులాల చైన్‌ను లాక్కెళ్లారు.

అనుమానం వస్తే స్థానికులకు చెప్పాలి

ఒంటరిగా వెళ్లే మహిళలను లక్ష్యంగా చేసుకొని చైన్‌స్నాచింగ్‌కు పాల్పడుతున్నారు. ఎవరైన బైక్‌పై మెల్లగా వచ్చి అనుమానాస్పదంగా కనిపిస్తే స్థానికంగా ఉండే వారికి విషయం చెప్పాలి. అప్రమత్తంగా ఉండటంతోపాటు డయల్ 100కు కాల్ చేయాలి.

– కిరణ్‌కుమార్, ఏసీపీ, నిజామాబాద్

వర్షానికి కూలిన ఇళ్లు

కామారెడ్డి రూరల్: వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని రామేశ్వర్‌పల్లిలో రెండు పెంకుటిళ్లు కూలిపోయాయి. గ్రామానికి చెందిన సుతారి లక్ష్మి, సుతారీ రాజశేఖర్ ఇళ్లు కూలిపోయాయి. రెవెన్యూ అధికారులు గ్రామానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు.



రామేశ్వర్‌పల్లిలో కూలిన ఇల్లు

సర్కారు బడుల్లో శాలసిద్ధి

- ప్రభుత్వ బడుల వివరాలివ్వాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశం
- ఆన్‌లైన్‌లో వివరాల నమోదు
- ఈ నెల 26, 27తేదీల్లో జిల్లాస్థాయి రిసోర్స్ పర్సన్లకు శిక్షణ



నిజామాబాద్ అర్బన్ : సర్కార్ బడుల్లో మౌలిక వసతుల గణన, విద్యార్థుల ప్రగతి, ఉపాధ్యాయుల పనితీరు, బోధనాభ్యసన ప్రక్రియ పాఠశాల నాయకత్వం తదితర అంశాలపై గతంలో ప్రారంభించిన శాల సిద్ధి కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం తిరిగి పునఃప్రారంభిస్తోంది. ప్రభుత్వ పాఠశాలల వివరాలు కోసం కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన కార్యక్రమం కోసం రాష్ట్రస్థాయిలో శిక్షణ ఈ నెల 26, 27తేదీల్లో జరగనుంది. ఆ తర్వాత మండల స్థాయిలో శిక్షణ ఇచ్చి ప్రతి ప్రభుత్వ పాఠశాల వివరాలను ఈ శాలసిద్ధిలో నమోదు చేయనున్నారు.

కరోనాతో ఆగిన కార్యక్రమం

కేంద్ర ప్రభుత్వం శాలసిద్ధి కార్యక్రమాన్ని 2017–18లో ప్రారంభించింది. కరోనాతో గత మూడేళ్ల నుంచి ఆగిపోయిన ఈ కార్యక్రమాన్ని మళ్లీ పట్టాలెక్కించింది. ఈనెల 26, 27 తేదీల్లో జిల్లాస్థాయిలో వివిధ మండలాల నుండి ఎంపిక చేసిన 31 మంది రిసోర్స్ పర్సన్లకు శిక్షణ ఇస్తారు. అలాగే ఆగస్టు మొదటి వారంలో జిల్లా, మండల స్థాయిలలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించి అన్ని ప్రభుత్వ ప్రైవేట్ బడులు తమ వివరాలను నమోదు చేసే విధంగా విద్యాశాఖ అధికారులు పర్యవేక్షణ చేయనున్నారు. ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం పాఠశాల అభివృద్ధి నివేదికను ఆగస్టు 15లోగా తయారుచేసి, ఆగస్టు 31 వరకు శాలసిద్ధి యాప్‌లో వివరాలను నమోదు చేయాలి.

ప్రయోజనాలెన్నో..

శాలసిద్ధి కార్యక్రమంతో కేంద్ర ప్రభుత్వం నేరుగా ఓ ప్రభుత్వ పాఠశాల స్థితిగతులను తెలుసుకోవచ్చు. అక్కడున్న సమస్యలను పరిష్కరించే అవకాశముంటుంది. సర్వ శిక్ష అభియాన్ సామగ్ర శిక్ష అభియాన్‌గా మార్చిన తర్వాత శాలసిద్ధి నివేదిక ఆధారంగా జిల్లాలోని పాఠశాలలకు కేంద్రం నుండి పాఠశాలలకు నిధులిచ్చే అవకాశముంది.

శుభ పరిణామం..



శాల సిద్ధి కార్యక్రమం ద్వారా కేంద్ర ప్రభుత్వం పాఠశాల అభివృద్ధి ప్రణాళికలు సేకరించడం శుభపరిణామం. నివేదికలు తయారు చేసుకున్న తర్వాత అభివృద్ధి పనుల కోసం కేంద్ర ప్రభుత్వం నిధులను విడుదల చేయాలి.

– అంకం నరేశ్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు

నిధులుంటేనే అభివృద్ధి



నివేదికలు అనంతరమే నిధులు మంజూరైతే పాఠశాలల్లో మౌలిక వసతులు ఇతర అభివృద్ధి పనులు జరుగుతాయి. అలాగే ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం ప్రతి ఎటా నిధులు రెండు దఫాలుగా విడుదల చేయాలి. – – వెంకటేశ్వర్‌గౌడ్, పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

పారిశుధ్యం.. అస్తవ్యస్తం

- జీపీ కార్మికుల సమ్మెతో..
- ఎక్కడ పడితే అక్కడ చెత్త
- రోడ్లపై పారుతున్న మురుగు నీరు
- పట్టించుకోని పంచాయతీలు



ప్రధాన రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు



పిట్లంలో చిత్తడిగా మారిన వారసంత నిర్వహించే ప్రాంతం

నిజాంసాగర్: పంచాయతీ కార్మికులు సమ్మె చేస్తుండటంతో గ్రామాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. ప్రధాన చౌరస్తాలు, కాలనీలు, వారసంత జరిగే ప్రాంతాలు చెత్తాచెదారం, వ్యర్థాలతో నిండిపోయి చిత్తడిగా మారాయి. సేకరించే వారు లేకపోవడంతో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోతోంది. గ్రామ పంచాయతీల్లో సపాయి సిబ్బందితో పాటు ఒక మల్టీపర్పస్ కార్మికులు ఉన్నారు. మేజర్ పంచాయతీలు, మండల కేంద్రాల్లోని పంచాయతీల్లో 5 నుంచి 20 మంది వరకు కార్మికులు ఉన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని కార్మికులు 15 రోజుల నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నారు. దీంతో పల్లెల్లో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయి కంపు కొడుతోంది. డ్రెయినేజీలు చెత్తతో నిండి రోడ్డుపై మురుగు పారుతోంది.

పంచాయతీ కార్మికుల సమ్మెతో చెత్త తొలగింపు, పారిశుధ్య పనులకు ఆటంకం ఏర్పడింది. ముఖ్యంగా వారసంత జరిగే ప్రదేశాల్లో వ్యాపారులు వదిలేసిన వ్యర్థాలు కుళ్లిపోయి దుర్వాసన వస్తోంది. పిట్లం మండల కేంద్రంలో అంగడి ప్రాంతం చిత్తడిగా మారింది. అలాగే రోడ్లపై మురుగు పారుతోంది. బిచ్కుంద మండల కేంద్రంలో మురికి కాలువలు శుభ్రంగా లేకపోవడంతో మురికి నీరు రోడ్లపైకి చేరుతుంది. వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు చెత్తా, చెదారంతో కాలనీలు చిత్తడి, చిత్తడిగా ఉన్నాయి. ఈగలు, దోమలు వ్యాప్తి చెంది సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చెత్త తొలగిస్తున్న జీపీ పాలకవర్గం

కార్మికుల సమ్మె నేపథ్యంలో జుక్కల్ మండల కేంద్రంలో సర్పంచ్ రాములుసేట్, ఉప సర్పంచ్ బానుగౌడ్‌తో పాటు వార్డు సభ్యులు పారిశుధ్య పనులు చేపడుతున్నారు. కాలనీల్లో ఉన్న చెత్తను స్వయంగా తొలగిస్తున్నారు. అయినప్పటికీ అన్ని కాలనీల్లో చెత్త తొలగింపు సాధ్యం కావడం లేదు.

దుర్వాసన వస్తోంది..



మా కాలనీలో ప్రధాన రహదారిపై మురికి నీరు ప్రవహిస్తుండటంతో దుర్వాసన వస్తోంది. డ్రెయినేజీలు శుభ్రం చేయకపోవడంతో రోడ్లపై మురుగు పారుతోంది. కాలనీల్లో ఎక్కడ చూసిన చెత్తాచెదారం, వ్యర్థా లు దర్శనమిస్తున్నాయి. – అయుబ్‌ఖాన్, గాంధీనగర్, పిట్లం

అడ్డుకుంటున్నారు..

ప్రైవేట్ కూలీలతో పారిశుధ్య పనులు చేపడితే కార్మికులు అడ్డుకుంటున్నారు. కాలనీల్లో మురికి కాలువల శుభ్రం, చెత్త తొలగింపు పనులకు అడ్డుపడుతున్నారు. పక్క గ్రామాల్లోని కూలీలతో పారిశుధ్య పనులు చేయిస్తాం.

– యాదగిరి, పంచాయతీ ఈవో, పిట్లం

క్రైం కార్నర్

శుభకార్యానికి వెళ్లి వస్తూ మృత్యుఒడికి..

- రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి
- మరో ఆరుగురికి తీవ్రగాయాలు



శ్రీకాంత్‌రెడ్డి (ఫైల్)



ఘటన స్థలంలో క్షతగాత్రులు

మాచారెడ్డి: శుభకార్యానికి వెళ్లి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరో ఆరుగురు గాయపడ్డారు. ఈ ఘటన ఆదివారం పాల్వంచ మండలం ఆరేపల్లి శివారులో చోటు చేసుకుంది. మాచారెడ్డి ఎస్సై రాజారామ్ తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా చేగుంట మండలం బోనాల గ్రామానికి చెందిన అల్లి శ్రీకాంత్‌రెడ్డి(35) కొన్నేళ్లుగా కామారెడ్డిలో కార్ డెకార్స్ నడుపుతూ హౌజింగ్ బోర్డు కాలనీలో భార్య, పిల్లలతో నివాసముంటున్నాడు. ఆయన ఇద్దరు మిత్రులతో కలిసి తన కారులో ఫరీదుపేటలో జరిగిన ఓ శుభ కార్యానికి హాజరై కామారెడ్డి వెళ్తున్నాడు. ఆరేపల్లి శివారులో ఎదురుగా వస్తున్న టాటా మ్యాజిక్ వాహనం కారును ఢీకొంది. దీంతో డ్రైవింగ్ చేస్తున్న శ్రీకాంత్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో ఉన్న మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. అలాగే టాటా మ్యాజిక్ వాహనంలో ప్రయాణిస్తున్న ఆరుగురికి తీవ్ర గాయాలు కాగా 108 అంబులెన్స్‌లో కామారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య భాగ్య రేఖ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

కుంటలో పడి మహిళ మృతి

గాంధారి: మండలంలోని చిన్న పోతంగల్‌లో ఆదివారం కుంటలో పడి గొల్ల పోచవ్వ(45) మృతి చెందినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. గ్రామానికి చెందిన పోచవ్వ ఆదివారం ఉదయం తన పొలం వద్దకు పనులు చేయడానికి వెళ్లింది. పొలం పక్కనే ఉన్న కుంటలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు

గాంధారి: గాంధారిలో ఆదివారం వాహనాల తనిఖీ చేసినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. వాహనాలను నడుపుతున్న పలువురు మైనర్లను పట్టుకొని వాహనాలను సీజ్ చేశామన్నారు. వాహనాల యజమానులకు కౌన్సెలింగ్ ఇచ్చి జరిమానా వేశామన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లో ముప్కాల్ మండలం నల్లూర్ గ్రామ శివారులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఆదివారం లభ్యమైంది. ఎస్సై భాస్కరాచారి తెలిపిన వివరాలు.. ప్రాజెక్ట్‌లో ఆనకట్ట లోపలివైపు సుమారు 45–50 ఏళ్ల వ్యక్తి మృతదేహం లభించింది. పూర్తిగా కుళ్లిపోయి ఉండటంతో ప్రాజెక్ట్ వద్దనే పోస్టుమార్టం నిర్వహించినట్లు తెలిపారు. చనిపోయింది ముస్లిం వ్యక్తిగా అనుమానం వ్యక్తం చేశారు.

సంక్షేమ హాస్టళ్లను రక్షించాలి

డిచ్‌పల్లి: పేద విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన సంక్షేమ హాస్టళ్లను రాష్ట్ర ప్రభుత్వం రక్షించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి బోడ అనిల్ అన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రెండో రోజు ఆదివారం డిచ్‌పల్లి మండలంలోని బాలికల హాస్టల్ నుంచి జీపుయాత్ర ప్రారంభించారు. అనిల్ మాట్లాడుతూ.. సంక్షేమ హాస్టళ్ల పరిరక్షణే ధ్యేయంగా జీపుయాత్ర చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వం పెంచిన మెస్ చార్జీలను స్వాగతిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు దోమ తెరలను, ట్రంకు పెట్టెలను అందించాలని డిమాండ్ చేశారు. డిచ్‌పల్లి బాలికల హాస్టల్‌లో మౌలిక వసతులు కరువయ్యాయని, వెంటనే నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి బాలికల హాస్టల్‌లో ఏఎస్ఎంలను నియమించి విద్యార్థినులకు వైద్యసేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. జీపుయాత్ర ద్వారా హాస్టళ్లలో సర్వే నిర్వహించి సమస్యల పరిష్కారానికి భవిష్యత్‌లో కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాచకొండ విగ్నేష్, సిద్దాల నాగరాజు, మహేష్, దీపిక, జవహర్ సింగ్, సంధ్య రెడ్డి, అరవింద్, శివ, బాబురావు పాల్గొన్నారు.



డిచ్‌పల్లి బాలికల హాస్టల్ విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఘనంగా తీజ్



గాంధారి: మండలంలోని పిస్కిల్ గుట్ట తండాలో ఆదివారం తీజ్ పండుగను ఘనంగ జరుపుకున్నారు. ఉత్సవాల్లో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ పాల్గొన్నారు. జెడ్పీటీసీ శంకర్ నాయక్, ఎంపీపీ రాధాబలరామ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.